# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 3 మే 2025 | HYDERABAD






## 'ఎర్లీబర్డ్' వసూలు.. రూ.900.93 కోట్లు

సిటీబ్యూరో, మే 2 (నమస్తే తెలంగాణ) : ఎర్లీ బర్డ్‌లో భాగంగా జీహెచ్‌ఎంసీకి రూ.900.93 కోట్ల ఆస్తిపన్ను వసూలైనట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గతేడాది రూ. 831.23కోట్లు వసూలు కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.900.93 కోట్ల సమకూరిందన్నారు. ఎర్లీబర్డ్ పథకాన్ని 7,93,552 మంది వినియోగించుకున్నారని వివరించారు. అన్ని విభాగాల సమష్టి కృషితోనే రికార్డు స్థాయిలో ఆస్తిపన్ను వసూలు అయినట్లు తెలిపారు.

## క్రీడా ప్రాంగణాల అద్దెల్లో అక్రమాలు



సిటీబ్యూరో, మే 2 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ క్రీడా ప్రాంగణాలపై ప్రైవేట్ వ్యక్తులు దందా చేస్తున్న అంశాన్ని యంత్రాంగం సీరియస్ తీసుకున్నది. జోనల్ కమిషనర్ స్థాయిలో నెలవారీ అద్దె చొప్పున క్రీడా ప్రాంగణాలకు తీసుకుని కొందరు జీహెచ్‌ఎంసీకి నామమాత్రపు ఫీజులు చెల్లిస్తూ బయట వ్యక్తుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేస్తూ అక్రమ సంపాదనకు కేంద్రంగా మార్చుకుంటున్నట్లు ఫిర్యాదులందాయి. జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయం వెనుక ఓ ప్రైవేట్ వ్యక్తి దందా వెలుగులోకి రావడంతో ఈ తరహా వ్యవహారాలపై స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ అధికారులను నిలదీశారు. లోపాలను సరిదిద్ది తక్షణమే నూతన కేటాయింపులు ఏమైనా స్టాండింగ్ కమిటీ ముందుకు తీసుకురావాలని ఆదేశించారు. దీంతో జోనల్ కమిషనర్ నుంచి ప్రధాన కార్యాలయానికి క్రీడా ప్రాంగణాల కేటాయింపు ప్రతిపాదన చేరనున్నది. స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం పొందిన తర్వాతే టెండర్ ప్రక్రియ ద్వారా కేటాయింపులు చేయనున్నారు.

- మహానగరంలో మందగించిన రవాణా రంగం
- అలైన్‌మెంట్ల మార్పుతో అభివృద్ధి నిర్వీర్యం
- ఎలివేటెడ్ కారిడార్, గ్రీన్ ఫీల్డ్ హైవే, మెట్రో విస్తరణ ప్రణాళికలన్నీ కాగితాలకే పరిమితం




# రవాణాకు.. రిక్త హస్తం

నగర జనాభా కోటిన్నర దాటింది. ఇందుకు తగ్గట్టుగానే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మౌలిక వసతులకు పెద్దపీట వేసింది. పదేండ్లలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరాలతో పోటీపడే స్థాయికి తెచ్చింది. ఒక్కో ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు పకడ్బందీ విధానాలను అమలు చేసింది. రోడ్లు.. లింకు రోడ్లు.. మెట్రో.. ఫ్లైఓవర్లు. ఇలా అత్యంత కీలకమైన రవాణా వ్యవస్థను మెరుగుపరిచింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రేసు గుర్రంలా పరుగులు పెట్టే మహానగరానికి కళ్లెం వేసింది. దిక్కూదివాణం లేని ప్రణాళికలతో.. అభివృద్ధి మాట అనేది కాగితాలకే పరిమితం చేసింది. ఏడాదిన్నరలో ఏ ఒక్క ప్రాజెక్టులోనూ తట్టెడు మట్టి తీసిందీ లేదు. ఏ ఒక్క అభివృద్ధి పని చేపట్టిందీ లేదు. హడావుడే తప్ప.. ఆచరణలో రిక్త 'హస్తమే' చూపింది. అలైన్‌మెంట్ల మార్పుతో ప్ర'గతి' తప్పింది.

-సిటీబ్యూరో, మే 2 (నమస్తే తెలంగాణ)

కోటిన్నర దాటిన నగరానికి మెరుగైన రవాణా వ్యవస్థ అత్యంత కీలకం. అందుకే బీఆర్‌ఎస్ ప్రభుత్వం నగరంలో రోడ్లు, మెట్రో, ఇతర ఆధునాతన రవాణా సౌకర్యాలను కల్పించాలనే లక్ష్యంతో పనిచేసింది. ఇందులో భాగంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ఎస్‌ఆర్‌డీపీ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చిన ఫ్లైఓవర్లు ఒక టైతే.. ట్రాఫిక్ రహిత కూడళ్ల కోసం తీసుకున్న విధానపరమైన నిర్ణయాలతో నగరంలో వాహన వేగం పెరిగింది. గడిచిన పదేండ్లలో ఏనాడూ ట్రాఫిక్ స్తంభించిన దాఖాల్లేకుండా రవాణా వ్యవస్థను మెరుగుపరిచింది. కోర్‌సిటీ నుంచి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు వెళ్లే వారి సంఖ్య విపరీతంగా పెరుగుతున్న తరుణంలో ఐటీ కారిడార్‌కు అనువుగా ఉండేలా రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు 36 కిలోమీటర్ల మేర పొడవైన మెట్రోకు ప్రతిపాదనలు చేసింది. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా శివారుల్లో ట్రక్కు పార్కులు, బస్ టెర్మినళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కానీ కాంగ్రెస్ సర్కారు ఎస్‌ఆర్‌డీపీ ప్రాజెక్టుల నుంచి మొదలుకుంటే మెట్రో, హెచ్‌ఎండీఏ పరిధిలోని లింకు రోడ్ల వరకు తమకు అనుకూలంగా అలైన్‌మెంట్లు మార్పు చేసి.. అభివృద్ధిని నిర్వీర్యం చేయడం

మిగతా IIవ పేజీలో



**నగరంలో వర్షపాతం**

బండ్లగూడలో 1.0 సెం.మీలు,
ఉప్పల్ బండ్లగూడలో 5 మి.మీలు,
నాగోల్‌లో 3 మి.మీలు,
మౌలాలిలో 3 మి.మీలు

# స్వచ్ఛతలో సత్తా చాటేనా?

**స్వచ్ఛ సర్వేక్షణ్ -24పై కొనసాగుతున్న కేంద్ర బృందం సర్వే**

**టాయిలెట్ల నిర్వహణపై అసంతృప్తి?**

**త్వరలో కేంద్రం ప్రకటించే ర్యాంకుల్లో 'హైదరాబాద్'పై ఉత్కంఠ**

సిటీబ్యూరో, మే 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరం స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలుస్తుందా? బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంతో వచ్చిన ర్యాంకుల కంటే మెరుగైన ఫలితాలను రాబడుతుందా? ప్రస్తుత పారిశుధ్య నిర్వహణలో క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తుంటే.. అనేక అనుమానాలు, ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కొన్ని రోజులుగా కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాలు నగరంలో సర్వే చేస్తున్నాయి. మరో ఐదు రోజుల్లో సర్వే ప్రక్రియను ముగించుకుని ఢిల్లీకి వెళ్లనున్నది. అయితే పారిశుధ్య నిర్వహణపై క్షేత్రస్థాయి పర్యటనలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. పబ్లిక్ టాయిలెట్ల విషయంలోఎంపిక ప్రాంతాల్లోనే తిప్పుతున్న జీహెచ్‌ఎంసీ అధికారుల తీరును తప్పుపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం వాటర్ ప్లస్ కేటగిరీలో ఈ బృందం సర్వే జరుపుతున్నది. మరోవైపు పారిశుధ్య నిర్వహణలో హైదరాబాద్‌కు మార్కులు ఆశించిన స్థాయిలో రావడం కష్టమేనన్న చర్చ జరుగుతున్నది.

### అధికారుల్లో గుబులు..

స్వచ్ఛ సర్వేక్షణ్-2024 ర్యాంకుల ప్రకటన, సర్వే ప్రక్రియ ప్రారంభమవుతున్న తరుణంలో జీహెచ్‌ఎంసీ అధికారుల్లో గుబులు మొదలైంది. ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కీలక నగరాలకు ర్యాంకులను ప్రకటిస్తూ వస్తున్నది. 2015 నుంచి 2023 వరకు 10 లక్షల జనాభా కంటే ఎక్కువ సిటీ జాబితాలో హైదరాబాద్ మెరుగైన ర్యాంకింగ్ సాధించింది . 2023 సంవత్సరానికి సిటీ 9వ ర్యాంకు, భారతదేశంలో ఫైవ్ స్టార్ రేటింగ్ పొందిన చెత్త రహిత నగరంగా హైదరాబాద్‌కు అవార్డు దక్కింది. ఈ నేపథ్యంలోనే నగరంలో ప్రస్తుత సర్వే బృందం స్వచ్ఛ సర్వేక్షణ్-2024పై సర్వే ప్రారంభించింది. వచ్చే నెలలో ర్యాంకుల జాబితాను కేంద్రం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

### టాయిలెట్ల నిర్వహణపై ఆరా



కేంద్రం నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాలు వచ్చి నగరంలోని టాయిలెట్లను పరిశీలించింది. అయితే అధికారులు మాత్రం వారిని తప్పుదోవ పట్టించి శుభ్రంగా ఉన్న టాయిలెట్ల దగ్గరకు తీసుకువెళ్లి చూపించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. 10 రోజుల స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో భాగంగా నగరానికి వచ్చిన కేంద్ర బృందం టాయిలెట్ల శుభ్రత, వినియోగం, నిర్మాణ నాణ్యతను చెక్ చేస్తున్నది. వీటితో పాటు గ్రేటర్‌లో పలు చోట్ల లూ కేఫ్‌లకు తాళాలు వేస్తూ దర్శనమిస్తున్నాయి.

- దాడి చేసి గుడిసె నేలమట్టం..
- ప్రశ్నిస్తే హత్యాయత్నం
- జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికురాలు నారాయణమ్మ ఆరోపణ

# నా గుడిసెను కూలగొట్టిండ్రు

## దానం నాగేందర్ అనుచరుల దాదాగిరి

నిలువ నీడ కల్పించేందుకు దివంగత వైఎస్‌ఆర్ ప్రభుత్వం తనకు ఇచ్చిన భూమిని కాంగ్రెస్ నేతలు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని జీహెచ్‌ఎంసీలో ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికురాలు ఆరోపించారు. ఖైరతాబాద్ జోన్‌లోని జూబ్లీహిల్స్ సర్కిల్ - 18 పరిధిలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న దేరంగుల నారాయణమ్మ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 20 ఏండ్లుగా జీహెచ్‌ఎంసీలో పారిశుధ్య కార్మికురాలిగా సేవలందిస్తున్నానని చెప్పారు. - ఖైరతాబాద్, మే 2

ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత బేగంపేటలోని ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీసులో ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయనను కలిసి తన గోడును వెల్లబోసుకున్నానని నారాయణమ్మ తెలిపారు. తనకు నిలువ నీడలేదని, ఏదైనా జాగ చూపిస్తే గుడిసె వేసుకుంటానని చెప్పగా, వెంటనే స్పందించిన వైఎస్ఆర్ అధికారులకు ఆదేశాలు జారీ చేసి ఫిల్మ్‌నగర్‌లోని వినాయక్‌నగర్‌లో 124 గజాల స్థలం కేటాయించారన్నారు. చిన్న గుడిసె వేసుకొని భర్త, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తుండగా, ఆ స్థలం విలువైంది కావడంతో నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే, అతని అనుచరుల కండ్లు పడ్డాయన్నారు. 20 ఏండ్లుగా తన భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తూనే ఉన్నారని, 20 సార్లు గుడిసెను కూలగొట్టించారని, రెండు సార్లు తగులబెట్టించారన్నారు. తన భర్త మరణించిన తర్వాత ఆ నాయకుల వేధింపులు పెరిగాయని, ఆ స్థలం విషయంలో తనపై హత్యాయత్నం జరిగిందన్నారు. 20 ఏండ్లుగా ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ నాయకుడు మామిడి నర్సింగ్ రావు, వారి అనుచరులు తన భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, అనేక సార్లు దాడులు సైతం చేయించారని, ప్రాణభయంతో బాల్‌రెడ్డినగర్‌లో ఉన్న తన కుమార్తె ఇంట్లో తలదాచుకుంటున్నట్లు నారాయణమ్మ తెలిపారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన పేదరికంపై దయతలచి భూమి ఇస్తే అదే కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యే దానం నాగేందర్, అతని అనుచరులు తన భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, తన గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని చెప్పారు. ఎమ్మెల్యే దానం, అతని అనుచరులతో తనకు ప్రాణగండం ఉందని, తనకు, తన కుటుంబానికి ఏదైనా జరిగితే వారిదే బాధ్యత అని తెలిపారు. ముఖ్యమంత్రి

మిగతా IIవ పేజీలో





వైఎస్‌ఆర్ హయాంలో భూమి ఇవ్వగా.. గుడిసె వేసుకున్న నారాయణమ్మ (ఫైల్), మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు




## కుటుంబ నియంత్రణలో మగాళ్ల వెనకడుగు

**జిల్లా వ్యాప్తంగా 0.7 శాతం మందే ముందుకు**

**పతులకు కు.ని వద్దంటున్న సతులు**

సిటీబ్యూరో, మే 2, (నమస్తే తెలంగాణ): ప్రతి దాంట్లో లేడీసే ఫస్ట్.. అని ఏ సందర్భంలో అన్నారో గానీ, ప్రేమ, ఆప్యాయతలు చూపించడంతో పాటు కుటుంబం లాంటి సమాజాన్ని కాపాడటంలోనూ నారీమణులే ముందుంటున్నారు. కుటుంబ నియంత్రణలో మహిళలే కీలక భూమిక పోషిస్తున్నారు. ప్రస్తుతమున్న ఆర్థిక, సామాజిక అవసరాలకు అనుగుణంగా ఇద్దరు పిల్లలే ముద్దు..ఆ తరువాత వద్దు అంటూ కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల్లో పురుషుల కంటే అతివలే అధికంగా ఉన్నారు. వైద్యులు భార్యాభర్తలిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చినా కూడా పురుషులు ఈ విషయంలో ముందుకు రావడం లేదు. మరోవైపు కొందరు మహిళలు తమ భర్తలకు శస్త్ర చికిత్స వద్దంటూ తమకు మాత్రమే చేయాలని చెబుతున్నారు. జిల్లాలోని సుల్తాన్‌బజార్ మెటర్నిటీ ఆసుపత్రిలో గతేడాది జనవరి నుంచి నేటి వరకు 325 కు.ని ఆపరేషన్లు నిర్వహించగా, అందులో ఒక్కరంటే ఒక్కరూ కూడా పురుషులు లేకపోవడం గమనార్హం.



### ఒక్కశాతం కూడా లేరు..

కుటుంబ నియంత్రణకోసం భార్యాభర్తలు ముఖ్యంగా రెండు పద్ధతులను అనుసరిస్తుంటారు. అందులో మొదటిది ఒక బిడ్డ పుట్టిన తరువాత ఆ బిడ్డకు సరైన పోషకాలు మిగతా IIవ పేజీలో

# కరెంట్ మీటర్ల గోల్‌మాల్

## మొన్న 30.. ఇవాళ 42!

**ఒకే గదిలో పదుల సంఖ్యలో మీటర్ల గుర్తింపు**

**అక్రమార్కులతో సిబ్బంది కుమ్మక్కు..**

**సరైన పత్రాలు లేకుండానే మీటర్ల మంజూరు**

**విచారణ చేపట్టిన విద్యుత్ విజిలెన్స్ అధికారులు**

**కేసు నమోదు చేసిన పోలీసులు**

**సిటీబ్యూరో/ శేరిలింగంపల్లి, మే 2(నమస్తే తెలంగాణ):**

ఖాజాగూడా చిత్రపురికాలనీలో చెన్నకేశవరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన 42 విద్యుత్ మీటర్లను రాయదుర్గం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు, దుండిగల్ పోలీసులు కలిసి స్థానిక ప్రభుత్వ స్థలంలో వేణుగోపాల్ అనే వ్యక్తి నిర్మించిన రేకుల ఇంటిపై దాడి చేసి 30 మీటర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇంటి నంబర్లు, పత్రాలు లేకుండానే కరెంటు మీటర్లను పొందినట్లు తేలింది. ప్రభుత్వ స్థలంలోని ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు కరెంట్ మీటర్లను వాడడంతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.



సాధారణంగా విద్యుత్ మీటర్ పొందాలంటే స్థలం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, ఇంటి నంబర్, నిర్మాణ అనుమతుల పత్రాలను సమర్పించాలి. రూ. 3వేలు చెల్లించి..మీటర్ పొందొచ్చు. కానీ కాసులకు కక్కుర్తి పడుతున్న కొందరు అధికారులు.. నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా దొడ్డిదారిన ఒక్కో మీటర్‌కు రూ.15వేల నుంచి రూ.18వేలు అవసరమైతే రూ.20వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మీటర్లకు మీటర్లే కనిపించకుండా పోవడం ఇప్పుడు విద్యుత్ శాఖను కుదిపేస్తున్నది. నగర శివారు ప్రాంతాల్లో జరుగుతున్న ఇటువంటి ఘటనలతో ఆ శాఖలో భారీ అవినీతి బయటపడుతున్నది.

### ఇంట్లో దాచిపెట్టిన 42 మీటర్లు..

ఖాజాగూడా చిత్రపురికాలనీలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన 42 విద్యుత్ మీటర్లను రాయదుర్గం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని అక్రమంగా దాచిన చెన్నకేశవరెడ్డి అనే కాంట్రాక్టర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యుత్ శాఖలో విద్యుత్ మీటర్ల గోల్ మాల్ వ్యవహారంపై ఇబ్రహీంబాగ్ ఏడీఈ అంబేద్కర్ గురువారం రాత్రి రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రిలీజ్ అయిన సర్వీస్‌లకు సంబంధించిన మీటర్లు ఓ ప్రైవేట్ వ్యక్తి ఇంట్లో ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి చేరుకునే సమయానికి వాటిని మరో ప్రాంతానికి తరలించినట్లు ఏడీఈ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన రాయదుర్గం పోలీసులు ఖాజాగూడ చిత్రపురి కాలనీలో ఓ ఇంట్లో అక్రమంగా దాచి ఉంచిన 42 విద్యుత్ మీటర్లను స్వాధీనం చేసుకున్నారు. మాజీ కాంట్రాక్టర్ చెన్నకేశవరెడ్డి ఈ విద్యుత్ మీటర్లను కలిగి ఉన్నట్లు గుర్తించారు.

మిగతా IVవ పేజీలో




IV

బాలాపూర్ ప్రభుత్వ పాఠశాల ఇది. రోడ్ల పనుల కోసం కాంట్రాక్టర్ పాఠశాల మైదానంలో ఇసుక, డస్ట్, కంకర డంపింగ్ చేశాడు. ఈ పాఠశాలలో నీట్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం పరీక్ష జరుగనున్నది. ఆలోగా 'డంపింగ్'ను తొలగించకపోతే అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తే అవకాశమున్నది. - బడంగ్‌పేట